డి.ఐ.జి. బంగ్లా..... ఆ మధ్య వరకూ సెంట్రల్ ఇన్వెస్టిగేటివ్ బ్యూరోలో పనిచేసి ఇటీవలే రాష్ట్రానికి వచ్చిన స్ట్రిక్ట్ పోలీస్ ఆఫీసర్ దొర..... నిజంగానే దొరబాబులా వుంటాడు. కొందరు ఆయన్ని గడ్డివాము దగ్గర కాపలా కుక్క అని అంటారు. ఆయనకు తెలుసు అలా పోల్చటంలో ఒకింత మొరటుదనం వున్నా ప్రజల శాంతిభద్రతలకు తను నిజంగానే కాపలా కుక్కనని గర్విస్తాడాయన.

(ఈ పాత్రకు నిజంగా ఇన్‌స్పిరేషన్ ఇచ్చిన పోలీసాఫీసర్ ఇప్పుడు రాష్ట్ర సర్వీసులోనే వున్నారు. వారి పేరు కె. సదాశివరావు ఐ.పి.యస్. రచయిత)

ఇప్పుడాయన బంగ్లా హడావిడిగా వుంది. బంగ్లాముందు అప్పటికే పదిమందిదాకా ఎ.ఎస్.పిలు గుమికూడి ఉన్నారు.

యుగంధర్‌కి తెలిసిన విషయం వారికింకా తెలీదు.

ఎందుకో హఠాత్తుగా డి.ఐ.జి రమ్మని కబురంపాడు అంతే తెలుసు వారికి.

డిప్యూటి ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ పరిధిలో నాలుగు జిల్లాలుంటాయి. ఆ నాలుగు జిల్లాల ఎస్పిలు, ఏ.ఎస్.పి.లు, డి.ఎస్.పిలు ఆయన కిందే పనిచేస్తుంటారు, ఆయన ఎవరికి జవాబుదారి కాదు ఒక్క డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్‌కి (రాష్ట్ర అత్యున్నత పోలీస్ అధికారి) తప్ప.

సమయం ఉదయం పదకొండు గంటలు-- దొరవారి బంగ్లా గంట మ్రోగింది.

జవాన్ వచ్చి సెల్యూట్ చేసి "దొరవారు హాల్లోకి వచ్చారు మిమ్మల్ని పిలుస్తున్నారు" అన్నాడు.

అందరూ తమ డ్రస్సులవైపు ఓసారి చూసుకుని కేప్స్ సరిగ్గా పెట్టుకుని లోనకు నడిచారు.

పొడవైన హాలు నిశ్శబ్దంగా వుంది. హాలుమధ్య పెద్ద టేబుల్ దానికిటూ అటూ చెయిర్ దానికి ఆ చివర దొర కుర్చీ... ఆయనిప్పుడు కూర్చుని లేరు నిలుచుని వున్నారు.

"గుడ్‌మార్నింగ్ సర్"

"వెల్... మార్నింగ్ గుడ్ మార్నింగ్ మైడియర్ యంగ్ ఆఫీసర్స్ ప్లీజ్ టేక్ యువర్ సీట్స్" అన్నాడు గంభీరంగా ఆయన.

ఐ.పి.యస్ ట్రైనింగ్‌లో పోలీస్ అకాడమీలో వున్నప్పుడు ఆయన ధైర్య సాహసాల గురించి, ఆయన నీతి నిజాయితీల గురించీ కథలు కథలుగా చెప్పుకోవటం వారికిప్పుడు జ్ఞాపకానికొచ్చింది. భక్తిగా ఆయన చెప్పబోయే విషయాలకోసం వారు వినయంగా ఎదురు చూస్తున్నారు.

"నిజంగా నిజాయితీగా, ఎలాంటి ప్రలోభాలకు, వత్తిడులకు లొంగకుండా మనశాఖలో ప్రతి ఒక్కరు పని చేస్తే ఇన్ని నేరాలు ఈ వ్యవస్థలో జరుగుతాయంటారా?" నెమ్మదిగా, ఒక్కోమాట స్లో మోషన్ బుల్లెట్‌లా వచ్చి తగిలాయి వారికి.

"వెల్ .. జరగవని నా ఖచ్చితాభిప్రాయం. ఇకపోతే మీ ధైర్య సాహసాలకో పరీక్ష

పెడుతున్నాను. అందులో మీరు మీ ప్రాణాల్నే వదులుకోవాల్సిన పరిస్థితి రావచ్చు. అందుకు సిద్దపడినవారే ముందుకు రావచ్చు. ఇందులో ఎలాంటి నిర్బంధం, అధికారం లేవు".

తిరిగి నిశ్శబ్దం అలుముకుంది.

"మంత్రి పట్టాభి నియాజక వర్గానికి ఎవరు వెళతారు? మధుమూర్తితో ఎవరు తలపడతారు!"

వారిలో ఒకింత కలవరపాటు. ఖాకీబట్టల చాటున కలవరపాటు. ఆ పదిమంది ఆఫీసర్స్‌కి అగ్ని పరీక్ష.

"నాకు తెలుసు వాళ్ళెంత నరరూప రాక్షసులో...." సూదిపడితే వినిపించే విచిత్రమయిన నిశ్శబ్దం అలుముకుంది అక్కడ.

దొర కళ్ళు పోలీసు జాగిలంలా ఆ పదిమంది ఆఫీసర్స్ మొఖాల వైపు ఓ రౌండ్ వేశాయి. అంత వేగంతో అతను చూడగలడని వారికి ఊహకి అందని విషయం.

వాళ్ళు ఆలోచిస్తున్నారు. ఆ పోస్ట్ ఆఫర్ చేయటమంటే కోరి కోరి పులినోట్లో తలపెట్టటమే అని పారికి బాగా తెలుసు.

ఎందుకంటే రాష్ట్రానికి కొత్తగా వచ్చిన ప్రతి ఆఫీసర్ ముందుగా చదివేది పట్టాభి, మధుమూర్తి ఫైలే.

యుగంధర్‌కి ఆనందంగా వుంది అక్కడెవరూ నేనేనంటూ ముందుకు రాకపోటం.

అక్కడే అతను పొరపాటుగా యోచించాడు. ఆ సమావేశపు వివరాలు సయితం అప్పటికే పట్టాభి, మధుమూర్తులకు తెలిసిపోయాయని అతనికి తెలియని విషయం. గౌసుద్దీన్ అనే ఆఫీసర్ సీట్లోంచి లేచి నిలబడ్డాడు.

"యూ?" అన్నట్లు ఒకింత ఆశ్చర్యపోయి చూశాడు దొర.

అతను వినయంగా తలూపాడు.

అప్పటికే యుగంధర్ షాక్ తిన్నాడు.

ఆ ప్రాంతానికి ఎవరూ వెళ్ళరు. వాళ్ళతో ఎవరూ తలపడలేరు అనుకుంటున్న యుగంధర్ అంచనాలు తలక్రిందులయ్యాయి. తనిప్పుడు లేవాలో, లేదో తెలియని సంధ్గత...

అంతలో---

"ఓన్‌లీ ఒన్?" దొర ఒకింత సర్‌కాస్టిగ్గా అన్నాడు.

చటుక్కున లేచి నించున్నాడు యుగంధర్. దొర ప్రశంసా పూర్వకంగా చూశాడు అతనివేపు.

యుగంధర్ లేవటంతో గౌసుద్దీన్ మొఖం మాడిపోయింది.

"యూ టూ ఓన్ లీ? వెల్, మీ ఇద్దరిలో ఎవర్ని పంపాలన్నది త్వరలో డిసైడ్ చేస్తాను నౌ యూ కెన్ గో" అన్నాడు దొర గంభీరంగా.

0 0 0

"నేను చెప్పానా లేదా? మరొకరో, ఇద్దరో కూడా తమ సమ్మతి తెలుపుతారని" మార్తాండ్ సాలోచనగా అన్నాడు.

"ఎలా ఊహించగలిగారు?" యుగంధర్ ఆశ్చర్యపోతూ అన్నాడు.

మార్తాండ్ మౌనంగా వున్నాడు.

" గౌసుద్దీన్ అంత ధైర్యం చూపించటం నాకానందంగా వుంది. కండబలమే కాదు, గుండెబలమున్న మనిషి, చూశారా నాన్నగారు?" అప్పుడు చటుక్కున తలెత్తి కొడుకువేపు చూశాడు అతను.

"గుండెబలంకాదు. తన గుడిని పదిలం చేసుకునేందుకు ముందుకొచ్చాడు".

యుగంధర్ తండ్రివేపు అర్థంకానట్లు చూశాడు.

" అర్థం కాలేదా? అతను పట్టాభి, మధుమూర్తుల మనిషి" షాక్ తిన్నాడు యుగంధర్.

"అంత తెలివి కలవాళ్ళు మధుమూర్తి , పట్టాభి"

"నమ్మలేకపోతున్నాను నాన్నగారూ"

"నువ్వు చిన్నబుచ్చుకోనంటే ఓ నగ్నసత్యం చెబుతాను. పోలీసుల్లోకంటే, క్రిమినల్స్‌లోనే ఎక్కువ తెలివి కలవాళ్ళున్నారు. అందుకు నిదర్శనమే రోజురోజుకు పెరుగుతున్న నేరాల సంఖ్య. నేరాలు 1 2 4 616 32 నిష్పత్తిలోనన్నా పరిష్కరించగలుగుతున్నారా?" అతని గొంతులో కర్కశత్వం తొంగిచూసింది.

యుగంధర్ తన డిపార్టుమెంట్ అసమర్థతకి సిగ్గుతో తలవంచుకున్నాడు.

"అవన్నీ ఇప్పుడు అప్రస్తుతం. ఇకపోతే ఇప్పుడు నీకు, గౌసుద్దీన్ కి మధ్య టాస్ ఎగరబోతోంది దొర చేతిలో. అది నీకు అనుకూలంగా పడేలా చేసుకో. ఈ వారంలో డి.ఐ.జి, మీ ఇద్దరిలో ఎవరన్నది డిసైడ్ చేసే పనిలో నిమగ్నమవుతాడు బీ అలర్ట్" అంటూ అతను బెడ్‌రూమ్ వేపుకు సాగిపోయాడు.

యుగంధర్ ఆలోచనల్లో పడ్డాడు. అరగంట తర్వాత ఒక నిర్ణయానికొచ్చి చేయకూడని పని ఒకటి చేయాలనే స్థిరనిశ్చయానికొచ్చాడు. ఆ మరుక్షణం ఫోన్ చేసి తనక్రింది పనిచేసే సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌ని రమ్మన్నాడు.

0 0 0

ఉదయం ఆరేడు గంటలమధ్య ఉదయ్ తన ఇంటి అడ్రస్‌కోసం అన్వేషణ మొదలెట్టాడు.

అతనికి చాలా బాధగా వుంది. తండ్రి కనీసం ఒక్కసారన్నా ఇంటి అడ్రస్ యివ్వలేదు. తను జైలుకెళ్ళేప్పుడు వున్న ఇల్లు మారినట్లు మాత్రం ఖచ్చితంగా తెలుసు ఉదయ్‌కి అంత పెద్ద నగరంలో ఎలా పట్టుకోవాలి?

వళ్ళో కూర్చోబెట్టుకుని గోరుముద్దలు తినిపించే తండ్రి మారిపోయినందుకు కలిగిన బాధకంటే కనీసం జైలునుంచి విడుదలయ్యాక అన్నా అక్కను, అమ్మను చూడలేకపోతున్నందుకు ఎక్కువ బాధగా వుంది అతనికి.

తిరుగుతున్నాడు ఆరాటంగా... వీధి వీధి తిరుగుతూనే వున్నాడు. ఫలితం కనిపించటంలేదు. సమయం పదకొండు గంటలు కావస్తోంది. సూర్యుడు నడినెత్తికొస్తున్నట్లుగా ఎండ చురుక్కుమనిపిస్తోంది. పెనుగాలికి, చలికి, ఎండకు  ఎండి జడివానలో తడిసి కొండరాళ్ళ మధ్య కరడు గట్టుకుపోయిన రాతిశరీరం అతనిది.

ఆ ఎండ అతనిలోని పట్టుదలను, ఆరాటాన్ని అణుమాత్రంకూడా అణచలేకపోతోంది. ఉన్నట్టుండి అతనికో ఆలోచన వచ్చింది. అంతే, ఆ మరుక్షణం నుంచి పోస్టాఫీసుల చుట్టూ తిరగడం ప్రారంభించాడు.

0 0 0

యుగంధర్ ముందు సర్కిల్ ఇన్స్‌పెక్టర్ వున్నాడు. ఆ సర్కిల్‌కి యుగంధరంటే భయభక్తులేకాదు గౌరవాభిమానాలు కూడా వున్నాయి.

“మిష్టర్ సర్కిల్! నాకో చిన్న సహాయం కావాలి. అది మన ఎథిక్స్‌కే విరుద్ధం కావచ్చు. అయినా తప్పదు. ఒక మంచిపని జరగాలంటే చిన్న తప్పు చేయక తప్పదు” ఒకింత సంజాయిషీ ఇచ్చుకుంటున్న ధోరణిలో అన్నాడు యుగంధర్.

శాసించాల్సిన అధికారి ఆ విధంగా తన్నో సహాయం అడుగుతున్నాడంటే అవుటాఫ్ ది వే వెళ్ళవలసిన పనే అయ్యుంటుంది.“తప్పక  సార్! చెప్పండి సార్! వాట్ కెన్ ఐ డూ ఫర్ యూ సర్?”

“ఏ.ఎస్.పి గౌసుద్దీన్  ఇంట్లో దొంగతనం జరగాలి” నెమ్మదిగా వత్తిపలుకుతూ అన్నాడు యుగంధర్.

ఎలాంటి క్రిమినల్‌నయినా గడగడలాడించే ది గ్రేట్ పోలీసాఫీసర్ యుగంధర్. తను ఓ యింట్లో దొంగతనం జరగాలని అడుగుతున్నాడు. పైగా ఆ దొంగతనం కూడా పోలీసాఫీసర్ ఇంట్లో. కొద్దిక్షణాలు అతనికేమీ అర్థం కాలేదు. కానీ ఒక్కటిమాత్రం ఆ సర్కిల్‌కి బాగా తెలుసు, యుగంధర్ ఒక పథకం వేశాడంటే అది ఖచ్చితంగా మంచికే అని, ఇంకో విషయం కూడా అర్థం కాక  కలవరపడ్డాడు సర్కిల్. అది తననే ఆ దొ ంగతనం చేయమని అడగడు కదా అని.

“నువ్వేం కంగారుపడక్కరలేదు మిష్టర్ సర్కిల్. ఇప్పుడు మనకు మంచి తెలివితేటలు

ధైర్యం వున్న వ్యక్తి కావాలి. అతను మన డిపార్ట్‌మెంట్ మనిషి మాత్రం కాకూడదు. మరో విషయం గుర్తుంచుకో-- గౌసుద్దీన్ ఇంట్లో లంచాలద్వారా సంపాదించిన సొమ్ము చాలా వుంది. దాన్ని దొంగతనం చెయ్యకూడదు. రికార్డుల్లోకి వచ్చిన వస్తువుల్నే దోచుకోవాలి. నా పని పూర్తయిపోగానే అతనింట్లో దోచుకున్నదంతా తిరిగి అతనికి చేర్చబడుతుంది."

సర్కిల్ కొంచెంసేపు ఆలోచిస్తూ వుండిపోయాడు.

"నిజానికి అతను కరప్టెడ్. అతనిప్పుడు పెద్ద స్టేక్‌నాశించి మరో చోటుకి బదిలీ కావాలనే ఆలోచనలో వున్నాడు. అతన్ని అక్కడకు వెళ్ళకుండా ఆపాలి. నాకదే కావాల్సింది. ఇది నీ సహకారంతో మాత్రమే పూర్తికాగలదనే ఆశతో పిలిపించాను. కాదంటే చెప్పు, నేను మరో వ్యక్తిని ఎన్నుకుంటాను. ఇందులో నిర్బంధం ఏమీలేదు. నామీద, నా నిజాయితీమీద నమ్మకం వుంటేనే ముందడుగు వెయ్" యుగంధర్ నిర్మొహమాటంగా అన్నాడు.

అప్పటికే తేరుకున్నాడు సర్కిల్. అప్పుడే రాత్రి పదకొండు గంటలవుతోంది. నిశ్శబ్దంగా వున్న ఆ హాలు నాలుగు గోడల మధ్య ఆ యిద్దరే వున్నారు. మొదటి ఎత్తులోనే మధుమూర్తి ప్రభృతుల్ని చిత్తుగా దెబ్బ తీయాలనే పట్టుదలతో వున్నాడు యుగంధర్.

ఇప్పుడతను సర్కిల్ అంగీకారం కోసం ఎదురుచూస్తున్నాడు. ఇద్దరూ చాలాసేపు నిశ్శబ్దంగా వున్నారు. సర్కిల్ మౌనాన్ని పాజిటివ్‌గా అర్థం చేసుకున్నాడు యుగంధర్.

"ఓకే సార్! ఆ గౌసుద్దీన్‌గారంటే నాక్కూడా ఎప్పటి నుంచో ఎలర్జీ. అతని యాక్టివిటీస్ అంటే పరమ అసహ్యం. అతనింట్లో వున్న చిన్న టేప్‌రికార్డర్ దగ్గర్నుంచి ఎ.సి. మిషన్ వరకూ పెద్దల తప్పుల్ని కాసి సంపాదించుకున్నవే. ఎంతమంది పేదప్రజల ఉసురో అతనికి తగలకపోదు. నేనతని కింద నా కర్మగాలి కొన్నాళ్ళు పనిచేశాను సార్! ప్రతీక్షణం హుమిలియేషన్. ఏనాడు ఏ కేసూ నిజాయితీగా పరిష్కరించలేక పోయాను. అయితే నా భయమల్లా ఒక్కటే. అతను నరరూప రాక్షసుడని, ఖాకీదుస్తుల్లో వున్న కొండచిలువని అందరికీ తెలుసు. ఆలాంటి దుర్మార్గుడింట్లో చూస్తూ చూస్తూ ఎవరు దొంగతనం చేయటానికి ముందుకొస్తారు? అదే సార్...మీరు చెప్పిన దగ్గర్నుంచి నా అలోచన."